విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

మంగళవారం 17 సెప్టెంబరు 2024 8 పేజీలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్

విశాలాంధ్ర-గన్నవరం : కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి నాలుగు నెలలు పూర్తయినా, విద్యారంగ సమస్యల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, విద్యాశాఖ మంత్రి తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గన్నవరంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఎస్టీయూ కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు పి.ఇమ్మానుయేల్ అధ్యక్షత ఎస్టీయూ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ ల పునర్వ్యవస్థీకరణ పేరుతో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై బాధ్యతలు మోపడం సరికాదని,బకాయి ఉన్న 9 విడతల కరువు భత్యం బకాయిలను, పి.ఆర్.సి. బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు . రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం వి ఎస్ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ పని సర్దుబాట్లలో అనేక అవకతవకలు తలెత్తాయని, వాటిని పరిష్కరించాలన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డి చంద్రశేఖర్ మాట్లాడుతూ నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీవో 117ను రద్దు చేయాలని, మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సంపాదిత సెలవుల నగదు జమ చేయాలని, మధ్యంతర భృతి తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పెద్ది వెంకటరత్నం, సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి తాతయ్య, సీనియర్ నాయకులు మండవ గౌరీ ప్రసాద్ జిల్లాలోని -మిగతా 2 లో ...

సెలవు దినాల్లో తరగతులా!

అడ్డుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-తెనాలి : మీలాద్ ఉన్ నబి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ సెక్టార్‌కి సంబంధించిన పాఠశాలలు, కళాశాలలో తరగతులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్ ప్రశ్నించారు. తెనాలిలో తరగతులు నిర్వహిస్తున్న పలు పాఠశాలలు, కళాశాలలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన -మిగతా 2 లో ...

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

-వరద బాధిత ప్రాంతాలకు రూ.6 వేల కోట్లు ఇవ్వాలి
-సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ : కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తక్షణమే రూ.6 వేల కోట్లు వరద సహాయ నిధులు ఇచ్చి ఆదుకోవాలని -మిగతా 2 లో ...

వరద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి 3 లో ...

దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విశాలాంధ్ర-విజయవాడ: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు పటిష్ట ఏర్పాటు చేస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అన్నారు. సోమవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భక్తులు అందరూ ఆనందోత్సవాలతో శాంతి భద్రతల మధ్య అమ్మవారి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో చేపట్టనున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు సలహాలు అందించారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్ తూర్పు జోన్ డీసీపీ. గౌతమి షాలి, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు ఇతర అధికారులతో కలిసి -మిగతా 2 లో ...

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

బాలికల వసతి గృహం శుభ్రం చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ: ఇటీవల వర్షాలు వరదలతో నగరంలోని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇదే క్రమంలో స్థానిక సింగ్‌నగర్ ప్రాంతంలోని బాలికల సంక్షేమ వసతి గృహం కూడా వరదల్లో పూర్తిగా మునిగిపోయింది. విషయం తెలిసిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) బృందం సోమవారం సందర్శించి అక్కడి అపరిశుభ్రంగా ఉన్న గదులు మరుగుదొడ్లు అన్నిటినీ పూర్తిగా శుభ్రం చేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయి కుమార్ మాట్లాడుతూ పేద వర్గాల -మిగతా 2 లో ...

వాటర్ హాకర్లకు నీటిని సరఫరా చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరంలోని వాటర్ హాకర్లకు నీటి సరఫరా యధాతధంగా కొనసాగించాలని సీపీఐ నగర కార్యదర్శి, వాటర్ హాకర్స్ సంఘం నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి కోరారు. నగర వాటర్ హాకర్ల సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో సోమవారం జరి గింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లా డుతూ నగరంలో వాటర్ పీపాలు 121 బండి ఉంటే మిన రల్ వాటర్ వచ్చిన తర్వాత సగం బండ్లకు పని లేకుండా పోయి వారి జీవనం అంతంత మాత్రమే నడుస్తుందని అన్నారు. నెలకు చలానా రూపంలో వారు చెల్లిస్తున్నారని, గతంలో 1997లో అప్పటి మేయర్ డాక్టర్ కొల్లి శారద కౌన్సిల్ తీర్మానం ద్వారా హెచ్ఎల్ఆర్, ఎల్ఎల్ఆర్ వాటర్ ట్యాంకులు దగ్గర అనుమతులు ఇచ్చారని గుర్తుచేశారు. 2007లో అప్పటి మేయర్‌లు కన్నా నాగరాజు, రాయపాటి సాయి మోహన్ కృష్ణ బీఆర్ స్టేడియం, స్తంభాలగరువు ట్యాంకుల దగ్గర అనుమతి ఇచ్చారని తెలిపారు. చలానాల ద్వారా పట్టుకున్న నీటిని టిఫిన్ బండ్లు, పూలబండ్లుకు, చిన్న చిన్న నివాసాల వారికి రిక్షా ద్వారా సరఫరా చేస్తూ వారి ద్వారా -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల దేశ రాష్ట్రపతి నుండి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మిద్దె శ్రీనివాసరావును, కంకిపాడు ఉపాధ్యాయ సహకార సంఘ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావులను సత్కరించారు.

సెలవు దినాల్లో తరగతులా!

మాట్లాడుతూ ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసికంగా హింసకు గురిచేస్తూ కళాశాలల యాజమా న్యాలు విచిత్ర ధోరణితో ప్రవర్తిస్తున్నారని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంకి ఎన్నిసార్లు తెలిసేలా చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంబాధాకరమని అన్నారు. ఒకవైపు అధికారుల దృష్టికి తీసుకెళుతున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఏఐఎస్ఎఫ్ ప్రత్యక్షంగా ధర్నాలకి, ఆందోళనలకి దిగిన తర్వాతే సెలవులు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ చెవిటోడి ముందు శంఖం ఊదిన విధంగా వాళ్ళ ప్రవర్తించడం జరుగుతుందని అన్నారు. ఇలాగే గనుక కొనసాగితే భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా ఒకసారి ఆలోచించి పిల్లల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని ప్రవర్తించాలని కోరారు. తెనాలి పట్టణ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు గండు శివ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ కొన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో తరగతులు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నప్పటికీ వారిలో ఎటువంటి మార్పు రాకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా నాయకులు మద్దినేని కిరణ్ బాబు, తెనాలి పట్టణ కార్యదర్శి చెన్నూరు సాయి, ఉపాధ్యక్షులు భూమేష్, కార్యవర్గ సభ్యులు అఖిల్, తేజ, పండు, హేమంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

వినాయకుడి గుడి వద్ద నుండి అమ్మవారి దేవాలయం కింద వరకు వెళ్లి మార్గ మధ్యలో అన్నింటిని పరిశీలించారు. గతంలో కొండరాళ్ళు జారిపడిన ప్రదేశాన్ని పరిశీలించి మళ్ళీ పునరావృతం కాకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా క్యూలైన్లు, ఘాట్లు , పార్కింగ్ ప్రదేశాలు, ప్రసాదం కౌంటర్లు ఇతర ప్రదేశాలలో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు, ఇతర శాఖల అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు జి. రామకృష్ణ, ఏవీఎల్. ప్రసన్న కుమార్ ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, దేవస్థాన ఈవో. కేఎస్.రామారావు, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వినుకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ శాఖా కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిని ఢిల్లీని తలదన్నే రాజధానిని చేస్తానని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని విభజన హామీలు అమలు చేస్తానని మోసపూరిత మాటలు చెప్పి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాగ్దానాలు చేసి రాష్ట్రానికి ఖాళీ చేతులు చూపించిన నరేంద్ర మోడీ రాష్ట్రంలో ఇటీవల జరిగిన వరదల ఫలితంగా విజయవాడ మహనగరం బుడమేరు తెగి కృష్ణానది పొంగిన ఫలితంగా విజయవాడ నగరంలోకి నీరు ప్రవేశించి ఏడడుగుల లోతులో నివాసగృహాలన్నీ కూడా నీట మునిగి పోయి ప్రజలు రక్షణ శిబిరాలలో అల్లాడుతుంటే కనీసం ఇంతవరకు తక్షణసాయంగా కేంద్రం నిధులు ప్రకటించకపోవడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆయన విమర్శించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ భారీ వర్షాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆర్థిక సహాయాన్ని అందించాలని మరల రైతాంగం తిరిగి వారు పైరు వేసుకునుటకు వ్యవసాయ అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని పంట నష్టం అంచనాలను సక్రమంగా వేసి తగిన విధంగా రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు పిన్నబోయిన వెంకటేశ్వర్లు షేక్ మస్తాన్ సాంబయ్య పొట్లూరి వెంకటేశ్వర్లు కే మల్లికార్జున దావీదు ధూపాటి మార్కు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

విద్యార్థులంటే అందరికి ఒక చులకన భావం ఉందని ముంపు నుండి తేరుకుని దాదాపు వారం గడుస్తున్నా నేటికీ ఈ హాస్టల్తో విద్యార్థులకు సరైన సౌకర్యాలు నష్ట పరిహారం ఇవ్వడంలో అధికారులు పాలకులు నిర్లక్ష్యం వహించడం బాధాకరం అన్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపించాలని బాలికల వసతి గృహాలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్షులు రంజిత్, సహాయ కార్యదర్శి సుధీర్, నాయకులు కార్తీక్, నరేష్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఫ్రీ ఎల్ఈడీ సర్వీస్ క్యాంప్

విశాలాంధ్ర-విజయవాడ: బుడమేరు వరద ముంపు బాధితులు బిగ్టీవీ సొల్యూషన్స్ ఫ్లడ్ రిలీఫ్-2024 ఉచిత ఎల్ఈడీ టీవీ సర్వీస్ క్యాంప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్, అల్లూరి సీతారామరాజు రోడ్డులోని బిగ్టీవీ సొల్యూషన్స్ కార్యాలయంలో సోమవారం ఫ్లడ్ రిలీఫ్ 2024 ఉచిత ఎల్ఈడీ టీవీ సర్వీస్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత సర్వీస్ క్యాంప్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలతో సుమారు 25వేల టీవీలు పాడయ్యాయన్నారు. వరదతో పాడయ్యిన టీవీలకు మరమ్మత్తులు చేసేందుకు బిగ్టీవీ సొల్యూషన్స్ ఫ్లడ్ రిలీఫ్ 2024 ఉచిత ఎల్ఈడీ సర్వీస్ క్యాంప్ను ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. బిగ్టీవీ సొల్యూషన్స్ నిర్వాహకులు కొల్లి సీతారామ్ మాట్లాడుతూ తాము రాష్ట్రంలోనే ప్రథమంగా అత్యాధునిక పరిజ్ఞానంతో అన్ని రకాల టీవీలకు అవసరమైన మరమ్మత్తులు అతి తక్కువ ధరలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నవనీతం సాంబశివరావు, షేక్ బాషా,వల్లభనేని సతీష్ వెలగంటి లక్ష్మణరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ హాకర్లకు నీటిని సరఫరా చేయాలి

కొద్ది మొత్తంలో సంపాదిస్తూ వాటర్ హాకర్లు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఇటీవల మున్సిపాలిటీ అధికారులు ఈ వాటర్ పీపాలు ఆపమని హుకుం జారీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్ల నుంచి ఈ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నా వీరు ఇతర పనికి వెళ్లలేని పరిస్థితి ఉందని, అధికారులకు స్పందించి వారికి న్యాయం చేయాలని లేనిపక్షంలో జీవనోపాది కోల్పోతారని అన్నారు. వెంటనే నీటిని విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వాటర్ హాకర్ సంఘం నగర అధ్యక్షులు ధూపాటి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్ఎల్ఆర్ వాటర్ పీపాల ప్రెసిడెంట్ ఎం.నారాయణ, స్తంభాలగరువు వాటర్ పీపాల ప్రెసిడెంట్ డి.వెంకటేశ్వరరావు, బీఆర్ స్టేడియం పీపాల అధ్యక్షులు ఎం.గుర్రప్ప, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ: సూర్యారావుపేట సెక్షన్, సిటీ సబ్ స్టేషన్, 11కేవీ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీరు బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపు ప్రదేశాలు: ఏలూరు రోడ్డు ఘోరీలదొడ్డి ఏరియా, విజయ టాకీస్ ఏరియా, నక్కలరోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, కాళేశ్వరావు రోడ్, వెంకటరత్నం వీధి, గోపరాజు రామచంద్రరావు వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, డోర్నకల్ రోడ్డు ఎండోకేర్ హాస్పిటల్ ఏరియా లలో విద్యుత్ సరఫరా ఆపబడునని వివరించారు. ఆ ఏరియాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్నియా మార్పిడుల్లో రికార్డు నెలకొల్పిన శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచంలో ఏ సంస్థ సాధించని విధంగా అత్యధిక కార్నియా మార్పిడులు చేసిన రికార్డులను ఎల్వీపీఈఐలోని శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్ సాధించింది. ఈ సందర్భంగా నగరంలోని కోడే వెంకట చౌదరి ప్రాంగణం చౌదరి ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డా ప్రశాంత్ గర్గ్ మాట్లాడుతూ 1987లో స్థాపించినప్పటి నుంచి ఎల్వీపీఈఐ 50,000కు పైగా కార్నియా మార్పిడులు చేసిందన్నారు. భారతదేశంలో వ్యాపించిన, నాలుగు నేత్రనిధులు రామాయమ్మ అంతర్జాతీయ నేత్రనిధి, హైదరాబాద్ మోహ్సిన్ నేత్రనిధి, విశాఖపట్నం దృష్టి దాన్ నేత్రనిధి, భువనేశ్వర్ టీకేఈబీ విజయవాడ ప్రస్తుతం ప్రతి సంవత్సరం 12,000కు పైగా నేత్రదానా లను అందుకుంటున్నాయన్నారు. శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.ప్రవీణ్ వడ్డవల్లి మాట్లాడుతూ కార్నియా వ్యాధుల ఫలితంగా వచ్చే కంటి సమస్యలకు సరైన చికిత్స అందుబాటును కొనసాగించడంపై శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్ కేంద్రీకరిస్తుందన్నారు.

వరద బాధితులకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: ఇటీవల బుడమేరు వరదలతో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు మునిగిపోయి ఇబ్బందులు పడుతున్న మున్సిపల్ కార్మికులకు మహంతి అప్పలనరసయ్య మహాలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ వారు సోమవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు, వెంకట గౌతమి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న దాతలు ప్రశంసనీయులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో 300 మంది వరద బాధితులకు కోడూరు కోట రాఘవయ్య విద్యాసంస్థలు, రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కోట రాఘవయ్య జూనియర్ మరియు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కోట వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో రూ.లక్ష 60 వేలతో నిత్యావసర సరుకులు తమవంతు సహాయంగా అందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి వరద బాధితులకు కోట రాఘవయ్య విద్యాసంస్థల సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు రాఘవయ్య, ఎస్సీ సెల్ నాయకులు గోసాల బాలకోటేశ్వరరావు, నాయకులు పీతా వెంకటేశ్వరరావు, కొప్పనాతి సీతారామయ్య, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు బచ్చు మురళీకృష్ణ, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ వి.వరప్రసాద్, కే.జగన్, కే.అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : ఈనెల 26,27,30 తేదీలలో సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించు వ్యాసరచన పోటీల కరపత్రాలను ఆదివారం ఈడేపల్లి శ్రీ భగవాన్ సత్యసాయి మందిరంలో కృష్ణాజిల్లా డివైఈవో శేఖర్ సింగ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర విద్యావిభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నారని, దీనికి అన్ని విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, మందిర ఇన్చార్జ్ అనుమకొండ వెంకటేశ్వరరావు, విద్యా విభాగ సమన్వయకర్తలు పి కళ్యాణి, ఎన్ నాగ గాయత్రి, పి వరప్రసాద్, సమయమంతుల వెంకట చిన్నయ్య గుప్తా, సింగరాజు భారతి, సిహెచ్ ప్రమీల, సురేఖ, హైమావతి, కాళికాదేవి, కొట్టి నాగమణి, మనోహర్లు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి



విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలోని మహిళ ఆరోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వికేఎన్ జయలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్ లోని ఎన్జీవో భవనంలో సోమవారం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా ఎటువంటి పదోన్నతులు లేకుండా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగానే మిగిలిపోతున్నారని పేర్కొన్నారు. సూపర్వైజర్లుగా పదోన్నతులు కల్పించేందుకు 143 జీవోను అమలు చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక పీహెచ్ఎన్ ను నియమించేలా 115 జీవో ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఆర్.వి.రమణ,కోశాధికారి వై. వనజాక్షి, కృష్ణా జిల్లా అధ్యక్షురాలు ఎం.సలోమి, కార్యదర్శి పరిమళ రాణి, ఏలూరు జిల్లా అధ్యక్షురాలు కే. నాగజ్యోతి, కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ 59 వ డివిజన్ ఆధ్వర్యంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ.భాస్కర్ రావు పర్యవేక్షణలో అక్షయపాత్ర సౌజన్యంతో సోమవారం 1200 మందికి భోజన పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరావు ప్రారంభించి గత 8 రోజుల నుండి వరద బాధితులకు ఆకలి తీరుస్తున్న సీపీఐ శ్రేణులను అభినందించారు. ప్రజానాయకులు పత్తా లేరున్నారన్నారు. నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించి అందించాలని కోరారు. సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు వస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య స్థానిక నాయకులు కంది ఆదినారాయణ, ఎల్ శివకుమార్, ఎం.గురునాథం, రఫీ ,ఎస్ చిన్నా, పి.నాగరాజు, ఉమామహేశ్వరరావు, సత్యవతి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్టీయూ సాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం ఆముదార్లంకలో వరద బాధితులకు ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కొమ్ము ప్రసాద్ మిత్ర బృందం, కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రూ. లక్ష వ్యయంతో 100 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, టవల్స్ అందచేశారు. యు.టైటస్పల్, పచ్చిగళ్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నేతలు కొల్లూరి బసవ, కొక్కిలిగడ్డ నవీన్, పసుమర్తి దినేష్, కొల్లూరి దినేష్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కంచికచర్ల : పట్టణ శివారు పరిటాల గ్రామ సమీపంలో సోమవారం బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో కంచికచర్లకి చెందిన ఉప్పుతల్ల తిరుపతిరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారాన్ని అందుకున్న కంచికచర్ల ఎస్ఐ బి రాజు, స్థానికులు 108కి సమాచారం అందించడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం విజయవాడ ట్రస్ట్ హాస్పటల్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి రాజు తెలిపారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : భారీ వర్షాలు, వరదలతో ముంపుకు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు నాయకులు గుండపనేని శ్రీనివాసరావు స్వామి సజ్జ శివకుమార్, దానబోయిన వెంకటనారాయణ, దూళ్ల జిమ్మీబాబు, నాగదేశి సునీత, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

గుప్తాకు కళాసేవా తపస్వి బిరుదు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త, వేముల చారిటీస్ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తకు కళా సేవా తపస్వి పురస్కారం ప్రదానం జరిగింది. సోమవారం ఎంబివికె భవన్‌లో కళాసౌరభ వారి జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం చేశారు. గుప్తకు సంస్థ పురస్కారాన్ని ప్రదానం చేసింది. వేదికపై ఆసీనులైన నాట్య ఆచార్యులు పసుమర్తి శ్రీవల్లి, రాయన శ్రీనివాసరావు, ఎ. సంతోష్, ఎం. ప్రణతి,అన్నంబోట్ల శోభ తరపున హర్షిణీలు, మరో 22 మందికి నాట్య కిషోర్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని నాట్య ఆచార్యులు ఖరీముల్లా, సాయి నిర్వహించగా ప్రారంభంలో చిన్నారులు ప్రదర్శించిన వివిధ నృత్యాంశాలు ప్రేక్షకుల మన్ననలను చూరగొన్నాయి.

సంజీవిని వైద్యాలయానికి ఏసీ వితరణ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం బార్లపూడి మాజీ సర్పంచ్, సిలికాన్ ఆంధ్ర సంజీవిని వైద్యాలయం సలహా మండలి మాజీ సభ్యులు కోనేరు రాజేంద్రప్రసాద్ (బుల్లిబాబు) జ్ఞాపకార్థం ఆయన కుమారులు కోనేరు శ్రీనివాస్ (అమెరికా), కోనేరు లక్ష్మణ (బార్లపూడి) సోమవారం రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని సాయి ఆరోగ్య వైద్యాలయం కు 42 వేల రూపాయల విలువగలఏసీ మిషన్ అందజేశారు. ఆ కుటుంబ సభ్యుల తరఫున కోనేరు లక్ష్మణ- రాణి దంపతులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్. కు అందజేయగావారిని వైద్యాలయ కుటుంబ సభ్యులు అభినందించారు.

అనిశ్చిత్ ఇండెక్స్‌కు విజయవాడలో మిశ్రమ సెంటిమెంట్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ అనిశ్చిత్ ఇండెక్స్ 2024ని విడుదల చేసింది. ఆర్థిక అనిశ్చితిని నిర్వహించడంలో విజయవాడ యొక్క ప్రత్యేక వైఖరిని ఈ నివేదిక వెల్లడించింది. ఆర్థిక అనిశ్చితి విషయానికొస్తే, 93 శాతం విజయవాడ స్పందనదారులు రాబోయే ఐదేళ్లలో ఆర్థిక అస్థిరత స్థాయిని అంచనా వేస్తున్నారు. జాతీయ సెంటిమెంట్ 88 శాతం కంటే కొంచెం ఎక్కువ నిరాశావాదం ఇక్కడ కనిపిస్తుంది. విజయవాడలో పని షెడ్యూల్ అనిశ్చితి కూడా ఎక్కువగా కనిపించింది. 51 శాతం మంది ఉద్యోగులు కొత్త పనులు లేదా అంశాల పరంగా అనూహ్యతను ఎదుర్కొంటున్నారు. జాతీయ సగటు 43 శాతంతో పోలిస్తే, ఇది మరింత సవాలుతో కూడిన పని వాతావరణాన్ని సూచిస్తుంది. కేవలం 43 శాతం మంది వ్యాపారులు మాత్రమే తమ వ్యాపార స్థిరత్వం, వృద్ధిపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

డ్రైయిన్లు ప్రక్షాళన చేస్తాం

విశాలాంధ్ర-అవనిగడ్డ : గ్రెయిన్లు ప్రక్షాళణ చేస్తామని పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు అన్నారు. సోమవారం 3,5 వార్డులతో పాటు సీతాయలంక లోని కొన్ని ప్రాంతాల్లో డైనేజిలోని పూడికను పూర్తి స్థాయిలో తొలగించి మురుగు నీరు సక్రమంగా పారుదల అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వరమే పారిశుధ్య నిర్వహణ పూర్తిచేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం.ధ్యానచంద్ర సంబందిత అధికారులను ఆదేశించారు. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కండ్రిక, ఉడా కాలనీ, రాజీవ్ నగర్, నున్న, ముస్తాబాద్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా అక్కడున్న శానిటరీ ఇనస్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వచ్ఛత హి సేవలో అందరూ భాగస్వాములు కండి

స్వచ్ఛత హి సేవలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం.ధ్యానచంద్ర నగర పౌరులకు పిలుపునిచ్చారు. స్థానిక మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈనెల 17న జరిగే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను కమిషనర్ సోమవారం పరిశీలించారు. స్వచ్ఛత హి సేవ ప్రారంభోత్సవ కార్యక్రమం మాకు నేని బసవపూర్ణయ్య స్టేడియంలో మంగళవారం ఉదయం 7.30 గంటలకు మొదలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కేవి.సత్యవతి, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్‌రాయ్, ఈఈ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ధనియాలపేట లోని ఇండియన్ బాప్టిస్ట్ బైబిల్ మిషన్ న్యూ లైఫ్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం రెవరెండ్ జాన్ మాథ్యూ ఆదేశాల మేరకు పాస్టర్ కె.ఆనంద్‌పాల్ ఆధ్వర్యంలో విజయవాడలోని బుడమేరు ముంపు బాధితులకు నిత్యవసరసరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు దేవరపల్లి కోటి, కొడాలి శ్రీకాంత్, చర్చి సంఘస్తులు పాల్గొన్నారు.

విపత్తుల బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ వన్‌టౌన్ : ఎవ్వరూ ఊహించిన విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వంతోపాటు తోటి సంఘీయులు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉందని సీనియర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం రవీంద్రనాథ్ బాబు పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక చిట్టి నగర్ లోని శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం ఏ పి ఎన్ బి సంక్షేమ సంఘం, న్యూస్ సంస్థల ఆధ్వర్యంలో వరదలలో నష్టపో యిన పేద మహిళలకు తుమ్మిడి సంస్థ దాదాపు రూ.లక్ష విలువైన చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇప్పటివరకు వరద బాధితులకు న్యూస్ (నాయి బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్)తో వరదలలో నష్టపోయిన నాయి బ్రాహ్మణ పేదలకు దాదాపు రూ.4 లక్షల నిత్యవసరాలు, వస్త్రాలు బహుకరించినట్లు తెలిపారు . వస్త్రాలు బహుకరించిన తుమ్మిడి సంస్థల యజమాని తుమ్మిడి శ్రీనివాస్, తెలుగు తోరణం పత్రిక సంపాదకులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహకారం వరదలలో సర్వం కోల్పోయిన వారికి అవకాశం ఉన్న ప్రతి వారు సహాయమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్బి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్కాపురం కనకారావు, రాష్ట్ర సంక్షేమ సంఘం నాయకులు కొమ్మవరపు భాను ప్రసాద్, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామనాథం, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు డి. రాము, నవిరి మహేష్ , రాయవరపు గణపతి పాల్గొన్నారు.

హెచ్ఎండి నుంచి 105 4జి, 110 4జి ఫోన్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): హెచ్ఎండి 105 4జి హెచ్ఎండి 110 4జిలను ఇప్పుడు హెచ్ఎండి పరిచయం చేసింది. యూట్యూబ్, యూట్యూబ్ మ్యూజిక్, యూట్యూబ్ షార్ట్స్ ని క్లౌడ్ ఫోన్ యాప్ ద్వారా మునివేళ్లపై అందించేలా దీనిని తీర్చిదిద్దారు. ఇది ప్రతి ఒక్కరికీ ఆధునిక సౌలభ్యం, వినోదాన్ని అందించడానికి రూపొందించబడింది. ముందుగా లోడ్ చేసిన యాప్ ద్వారా ఇంటర్నెట్ యాక్సెస్ లేకుండా సురక్షితమైన యుపిఐ లావాదేవీలను నిర్వహించ గల సామర్థ్యం ఈ ఫోన్‌లను ప్రత్యేకంగా నిలుపుతుంది. ఒక సంవత్సరం రీప్లేస్మెంట్ హామీతో ఇవి లభిస్తాయని హెచ్ఎండి ఇండియా ఏపీఏసీ సీఈఓ అండ్ విపి రవి కున్వర్ తెలిపారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

విశాలాంధ్ర విజయవాడ వన్ టౌన్ : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై త్వరలో జస్టిస్ బాలకృష్ణ కమిటీ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఆంధ్రా రాష్ట్రం పర్యటన దృష్ట్యా విజయవాడలో క్రైస్తవ నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కమిషన్, చారిత్రాత్మకంగా ఎస్సీలకు చెందిన వారని స్థితి ప్రకారం క్రైస్తవ మతంలోకి మారిన వారికి షెడ్యూల్డ్ కులం ఇచ్చే విషయం పర్శిలించుటకు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ('సిజెఐ') కె.జి. బాలకృష్ణన్, మరియు మాజీ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారి, డాక్టర్ రవీందర్ కుమార్ జైన్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ సభ్యుడు, ప్రొఫెసర్ (డా.) సుష్మా యాదవ్ కమిషన్ సభ్యులుగా ఉంటారు. కమిషన్ ప్రస్తుతం వివిధ రాష్ట్రాలలో ప్రజాభిప్రాయల సేకరణ మధ్యలో ఉందన్నారు. మనోభావాన్ని వ్యక్తం చేసి, క్రైస్తవులకు అస్ సి హెూదా కల్పించాలనే అంశాన్ని వారికి బలంగా తెలియజేసే విధంగా ఒక ప్రణాళిక రూపొందించడం జరిగినదినీ ఆలీవర్ రాయి తెలిపారు.

దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా మొవ్వ మండలం పెదపూడి గ్రామకాపురస్తులు, (లేటు) తాతా ప్రసాద రావు గారి కుమారుడు తాతా శివరామ ప్రసాద్ (అధార్ నెంబర్.. 78 31 82 74 93 56) చేసుకొను విన్నపము.

నా తండ్రిగారైన తాతా ప్రసాదరావు గారి తాలూకు ఆస్తులను ఆయన 2016వ సంవత్సరంలో అక్టోబర్ 19వ తారీఖున వీలునామా వ్రాయించి సదరు వీలునామానుమొవ్వ సబ్-రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో మూడవ పుస్తకము దస్తావేజులు నెంబరు 90/2016 గా రిజిస్టర్ చేసి ఉన్నారు. సదరు వీలునామాను నేను పెదపూడి గ్రామంలోని నా ఇంటి వద్ద నుండి ఫోటోస్టాట్ నిమిత్తం కూచిపూడి సెంటర్‌కు బైకుపై వెళ్ళు సందర్భంలో పైన ఉదాహరించిన ఒరిజినల్ వీలునామా పోయినవి. తిరిగి వచ్చి చూసినా ఫలితం లేదు నా తండ్రి గారు వ్రాయించి ఇచ్చిన ఒరిజినల్ వీలునామాను ఎక్కడ ఏ విధంగాను దుర్వినియోగపరచలేదు. ఈ విషయం యదార్థము. యదార్థముకాదని భవిష్యత్తులో రుజువైన ఎడల ప్రభుత్వం వారు తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు నేను పూర్తిబాధ్యత వహించగలననిధ్రువీకరించుచున్నాను.

తాతా శివరామ ప్రసాద్,
పెదపూడి, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా.
ఫోన్ నెం. 95 15 69 14 64

బాధితులకు సహాయ సహకారాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు మేరకు దాతలు స్పందిస్తూ వరద బాధితులకు విస్తృత సహాయ సహకారాలు అందించడం మరువలేనిదని ఎమ్మెల్యే తనయుడు, నియోజకవర్గ యువనాయకులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. పంచాయితీ పరిధిలోని పులిగడ్డ ఏరియాలో ఉన్న వసుమట్లలోని వరద బాధితులకు పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ చొరవతో విజయ్ బావ విజయవాడ రిచ్ ఆల్ నేషన్స్ చర్చ్ సంస్థ అద్దంకి కరుణకుమార్, సత్యవేదం శాస్త్రి బృందం వారి ఆర్థిక సహాయంతో లక్ష రూపాయలు విలువ చేసే నిత్యవసర సరుకులను మండలి వెంకట్రామ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఉసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్.ఎం.పి.పి పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండలి దినేష్, గ్రామ పెద్దలు మండలి శేషు, మండలి రాంమోహన రావు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మండలి శివప్రసాద్, జనసేన పార్టీ నాయకులు మండలి సుదీర్, బలరామ్, నాయకులు మండలి శివ, కూనపరెడ్డి సత్యనారాయణ, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగడ్డ వాగు పై గండ్లను పూడ్చండి:కోగంటి

విశాలాంధ్ర-కంచికచర్ల: మండల పరిధిలోని గొట్టుముక్కలలో ఇటీవల అధిక వర్షాలతో ఏనుగడ్డ వాగుకు వరద ముంపు గురికావడంతో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశానుసారం గండ్లు పూడ్చటంపై టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు గండ్లు పడ్డ ఏనుగడ్డ వాగును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోగంటి బాబు మాట్లాడుతూ త్వరతిగతిన గండ్లను యుద్ధ ప్రాతిపదిక మీద వెంటనే పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుళ్ళిమిల్లి రాజ్‌కుమార్, సర్పంచ్ గోగినేని అమర్నాథ్, గోగినేని శ్రీనివాసరావు, బండి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి సమాజం కోసం మహ్మద్ ప్రవక్త కృషి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రపంచ మానవళి శాంతి కోసం ఇస్లాం మార్గదర్శి మహ్మద్ ప్రవక్త తన జీవితాన్ని అంకితం చేశారని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు అధ్వర్యంలో దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సయ్యద్ సైదా,రామారావు,షేక్.మస్తాన్ వలి, షేక్. కరీముల్లా, పార్టీ సభ్యులు గబ్బర్, మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అందించటమే లక్ష్యం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: పేదరికం అత్యున్నత వైద్యసేవలకు అడ్డంకి కారాదనే లక్ష్యంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రవాస భారతీయుడు కనకపూడి రామారావు తెలిపారు. విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పి.జె.స్టీఫెన్ పాల్‌కు చెందిన స్వచ్ఛందసంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన కుటుంబసభ్యులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ, తనకు విద్యాబుద్ధులు నేర్పిన విస్సన్నపేట జడ్పీ పాఠశాలలోనే ఈ కార్యక్రమం నిర్వహించటం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఈ శిబిర నిర్వహణలో 1989-90 విద్యాసంవత్సరంలో తనతో కలసి పదవ తరగతి చదువుకున్న పలువురు నాటి సహచరులు కలసి భాగస్వాములు కావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నాడు తనతో కలసి చదివిన కొందరు ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తుండటం, స్థానికంగా మరికొందరు వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారని తెలిపారు. తాను చేస్తున్న కార్యక్రమం తెలుసుకుని వారంతా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ సందర్భంగా నాటి మిత్రబృందాన్ని కలసి అభినందించారు. వందల సంఖ్యలో రోగులు ఈ శిబిరానికి హాజరవ్వగా, మద్దులపర్వ మాజీ సర్పంచి కనకపూడి ఇశ్రాయేలు, సింగరేణి సంస్థ ఏజీఎం పల్లెపోగు రాజీవ్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, పిజెఎస్ సంస్థ ప్రతినిధులు జాన్, నాగేశ్వరరావు, రాధ, వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యప్రముఖులు డా.పి.విజయ్, కె.శ్రీనివాసరావు, ఎం.శ్వేత, డా.ప్రవీణ్‌చంద్, నిర్వాహక కమిటీ సభ్యులు కనకపూడి కీర్తికుమార్, సగ్గుర్తి సునీల్ పాల్గొన్నారు.

నిమజ్జనాలతో హోరెత్తిన గ్రామాలు

విశాలాంధ్ర-కూచిపూడి : డప్పుల హోరులో, డి.జె. సౌండ్ సిస్టం పాటలతో, యువత కేరింతల మధ్య సోమవారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మొవ్వ గ్రామంలో చెరువు వద్ద యాదవ సామాజిక వర్గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం బాణాసంచా కాల్పుల మధ్య డప్పు విన్యాసాలతో ఊరేగింపు నిర్వహించికృష్ణాతీరంలో నిమజ్జనం చేశారు.

వరద బాధితులకు అండగా

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఫెర్రీలోని వరద బాధితులకు జై భారత్ నేషనల్ పార్టీ అధినేత జేడీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకురాలు, విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు బి.వి అరుణాదేవి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ కౌన్సిలర్, ధరణికోట విజయలక్ష్మితో కలసి వరద బాధితులకు 250 మంది బాదిత కుటుంబాలకు దుప్పట్లను మరియు పండ్లు బిస్కెట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ధరణికోట శ్రీనివాసరావు,రాధిక శ్రీధరన్, కార్యకర్తలు మంజూష, వీరావళి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇప్పించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : 5 సోసైటీల పరిధిలో 250 ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని 5 సోసైటీలకు చెందిన రైతులు సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పులిగడ్డ 5 సోసైటీలకు చెందిన రైతులు మండలిని కలిసి బుద్ధప్రసాద్ ద్వారా సమస్యను ఆర్.డి.ఓ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గణనాధుడు నిమజ్జన శోభయాత్ర

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఆధ్యర్యంలో సోమవారం గణనాధుని శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీనుకు వాటర్ ఫిల్టర్ వితరణ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : గుండబోయిన పాలెం గ్రామానికి చెందిన బిల్డర్ జవ్వాజి చెన్నకేశవ రావు, పుష్పావతిల మనుమడి జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని అన్న క్యాంటిన్‌కి రూ.40 వేల వాటర్ ఫిల్టర్, అన్నదానానికి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరామ్ పాల్గొని వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించారు. స్థానిక టిడిపి నాయకులు గింజుపల్లి రమేష్, పద్మనాభుని కుటుంబ రావు, ధూళిపాళ్ల లక్ష్మణరావు, గింజుపల్లి వెంకట్రావు, సూర్యదేవర రాంప్రసాద్, కొర్రకూటి సైదులు, వడేఘర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'నాట్యశిల్పారామం' ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి నాట్యాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, లెజెండ్, కళారత్న డాక్టర్ వేదాంతంరాదేశ్యాంనాట్య క్షేత్రమైన కూచిపూడి అగ్రహారంలోని తన ఇంటి వద్ద 'కూచిపూడి నాట్య శిల్పారామం'ను నెలకొల్పారు. ఆయన శిష్యప్రశిష్యులు సోమవారం నాట్యాంశాలు ప్రదర్శించించారు. కూచిపూడి నాట్య శిల్పారామం సంస్థను ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు వేదాంతం వెంకట శివయ్య, కళాపీఠం విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ వేదాతరం రామలింగ శాస్త్రి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు అగ్నిహోత్రం హయగ్రీవ రామాచార్యులు సోదరులు చేసిన ప్రారంభోపన్యాసం తో శ్రీకారం చుట్టారు. నాట్యా చార్య ఏలేశ్వరపువెంకటేశ్వర్లు(కూచిపూడి), నాట్య రవళి పసుమర్తి శ్రీవల్లి (కైకలూరు) బృందం, త్రిపుర (నెల్లూరు) బృందం, శ్రీలీల (గుడివాడ) బృందం ప్రదర్శించిన పలు అంశాలు మైమరిపింపచేశాయి. కళాకారులకు జ్ఞాపికలు అంగ వస్త్రాలు పంపిణీ చేశారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-నందిగామ: పట్టణం మధిర ఆర్చి రోడ్ తాళ్లూరి ఫిల్లింగ్ స్టేషన్‌లో తాళ్లూరి ట్రస్ట్ వరద బాధితుల సహాయార్థం 100 మందికి సోమవారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దుప్పట్లు పంపిణి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం ముందుకు రావడం హర్షనీయం అన్నారు. బాధితుల సహాయార్థం మనం అందిస్తున్న సహాయం ప్రతివారికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య తెలిపారు.

దేవాదాయ శాఖ డీసీని సస్పెండ్ చేయాలి : రవికుమార్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దేవాదాయ శాఖలో అవినీతి రారాజు విజయరాజును సస్పెండ్ చేసి విచారణ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ ఇనిస్ట్యూషన్స్ ఎంప్లయిమెంట్స్ ఆసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోగంటి రవి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు తూట్లు పోడుస్తూ, భక్తులు ఇచ్చిన సోమ్మును దేవాదాయ శాఖలోని కాకినాడ డి.సి.విజయరాజు వంటి కొంతమంది వ్యక్తులు దోచుకుంటు ఉంటే దాతల హృదయాలు శోకిస్తున్నాయని అన్నారు.గత ఆరు సంవత్సరాల క్రితం ఆయనపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడిలో కోట్ల రుపాయల ఆస్తులు,పట్టు చీరల దుకాణాన్ని తలపించే విధంగా పట్టు చీరలు, బంగారం నగలు,వెండి వస్తువులు లభించాయన్నారు. మరలా కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆర్థిక సంబంధమైన పదవి ఇవ్వద్దు అని ఆర్డరు ఇవ్వగా నాటి వైసిపి మంత్రి ఆండతో అక్కడే మరలా డి.సిగా పోస్ట్ వేయించుకుని మరన్ని ఆస్తులు సంపాదించుకున్నారని వాటిని ఆధారాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యణ్ లకు ఫిర్యాదు చేశానని అన్నారు. దాంతో వారు తనపై వత్తిడి తీసుకువచ్చి కేసు విత్ డ్రా చేసుకోవాలని అన్నారని తాను అంగీకరించక పోవడంతో తన వారితో బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు.ఆరు సంవత్సరాలైన ఎసిబి ఛార్జీషీటు దాఖలు చేయలేదని తక్షణమే ఆయనను సస్పెండ్ చేసి ఛార్జీషీటు వేయాలని కోరారు.

బాధితులకు విరాళం

విశాలాంధ్ర-పెదనందిపాడు: మండల పరిధి లోని వరగాని గ్రామ ప్రజలు వరదబాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1,13,500ల విరాళాన్ని అందజేశారు. సోమవారం సీనియర్ తెలుగుదేశం నాయకులు మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్యను గ్రామస్తులు కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి హేంబాబు, గుడూరు వీరయ్య చౌదరి, పోపూరి నరేంద్రబాబు, పోపూరి శివరాం ప్రసాద్, బండారు నాగేశ్వరరావు, యర్రం సుబ్బారావు, గుంటుపల్లి రాంబాబు తదితరులున్నారు.

సీపీఐ విరాళాల సేకరణ

విశాలాంధ్ర-మేడికొండూరు : విజయవాడ నగర వరద బాధితుల కష్టాలను చూసి చలించిన సీపీఐ తమ వంతు సాయంగా సోమవారం మేడికొండూరు గ్రామంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. వారి కష్టాలను, జరిగిన నష్టాన్ని వివరిస్తూ సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుర్రంకొండ సత్యానందం, జ్వాలా మరియదాసు తదితరులు వరద బాధితుల సహాయార్థం పెద్దఎత్తున విరాళాలు సేకరించారు. నియోజకవర్గం లోని అన్ని వ్యాపార సముదాయాల్లో రాబోవు కొద్ది రోజులపాటు విరాళాలు సేకరించి వచ్చిన విరాళాల మొత్తాన్ని వరద బాధితుల సహాయార్థం వినియోగిస్తామని సీపీఐ నాయకులు తెలిపారు. గ్రామంలోని వ్యాపార సముదాయాలు తమ వంతు చిరు సహాయాన్ని సీపీఐ నాయకులకు అందించారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు ధర్మం వైపు నడిపిస్తాయి..

విశాలాంధ్ర-మంగళగిరి : మహమ్మద్ ప్రవక్త గొప్ప జీవితాన్ని స్మరించుకునే రోజు ఇది, ఆయన బోధనలు మనల్ని ధర్మం, శాంతి వైపు నడిపిస్తాయని నవ రంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యకులు షేక్ జలీల్ దైవప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇస్లాం అనేది శాంతికి చిహ్నం. ఇస్లాంను స్వీకరించిన ప్రతి విశ్వాసి తౌరాత్, జబూర్, ఇంజిల్, ఖురాన్ గ్రంథాలను అల్లాహ్ పంపిన గ్రంథాలుగా విశ్వసించాలన్నారు. వాటితో పాటు ముఖ్యంగా కల్మే తయ్యిబ, నమాజ్, రోజ, హజ్జ్, జకాత్‌ను ఆచరించిన వ్యక్తి నిజమైన ముస్లిం అని దైవప్రవక్త ముహమ్మద్ ప్రచారం చేశారన్నారు. మిలాద్-ఉన్-నబీ పండుగ వేళ ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో నిరుపేదలకు సాయపడాలని కోరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ సైదా, ఐటీ ఇన్‌చార్జ్ షేక్ కరీముల్లా, ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ గుర్రం రామారావు, షేక్ మీరా హుస్సేన్, షేక్ మస్తాన్ వలి, షేక్ గబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు ఓజోన్ పొరే కీలకం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: భూ మండలంలో సమస్త మానవాళితో పాటు సకల జీవరాసుల మనుగడకు ఓజోన్ పొరను కాపాడుకోవటం అత్యంత అవసరం అని, అందు కోసం ప్రకృతి వనరులను ఇష్టానుసారం దుర్వినియోగ పరచకూడదని ప్రజ్ఞ విద్యాసంస్థల కార్యదర్శి నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓజోన్ పొర కాపాడుకో లేకపోతే జరిగే నష్టాలపై విద్యార్థులకు వక్తృత పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన అనేక నమూనాలను చార్టుల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చక్రనాగ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణ నేపథ్యంలో వాటి నుండి వచ్చే ఉద్గారాల వల్ల ఓజోన్ కొరకు నష్టం వాటిల్లుతున్నదన్నారు. తద్వారా సూర్య కిరణాలు నేరుగా భూమికి తాకటం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నదని తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఉద్గారాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాయని, భావి శాస్త్రవేత్తలుగా మారే నేటి తరం విద్యార్థులు ఆ దిశగా తమ ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు జోజమ్మ, విజయ కుమారి, జరీన తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని విగ్రహం వద్ద అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : ఇందిరానగర్ మున్సిపల్ పాఠశాల వద్ద భక్తులు ఆరుద్ర సుబ్బారావు, కోగంటి బాబి, మాదాల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ఐదవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ నాయకులు చావలి ఉల్లయ్య, బోగి కోటేశ్వరరావు, నల్లగొర్ల శ్రీరామకృష్ణ, బోగి నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతి ఒక్కరూ ఎదుటి వారి పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలన్న మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి అనుసరణీయమని తూర్పు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా అన్నారు. ఆయన జయంతి సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని కొడిగుడ్ల సత్రం వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద షుమారు 2వేల మంది ప్రజలకు పాయసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షల తెలియజేశారు. మైనార్టీ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'హంజా అలీ' మరిన్ని విజయాలు సాధించాలి: డా॥షమ సుల్తానా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి సమాజానికి మంచి మెసేజ్ ఓరియంటెడ్ సినిమా తీసి అందరి మన్ననలు పొందుతున్న హంజా అలీ నా సోదరుడు కావడం చాలా గర్వకారణంగా ఉందని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్)ఉమెన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. హంజా అలీ భవిష్యత్తులో మరిన్ని సినిమాలు తీసి విజయాల పొందాలని ఆకాంక్షిస్తూ..హోప్‌విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక ఐటీసీ వెల్కమ్ హోటల్ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె 'పేకమేడలు' చిత్రం ఎడిటర్ అండ్ స్క్రీన్‌ప్లే రైటర్ అయిన హంజా ఆలీకి 'అప్రిసియేషన్' అవార్డు ఇచ్చి శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వ్యక్తి లక్ష్యం దిశగా పని చేస్తే విజయం వరిస్తుందనడానికి హంజా అలీ నిదర్శనమన్నారు. మద్య పానం వ్యసనానికి గురై తమ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్న వాళ్లకు 'ఐ ఓపెనర్'గా పేకమేడలు సినిమా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షమ సుల్తానా కుటుంబ సభ్యులు, హంజా అలీ కుటుంబ సభ్యులు, హోవిన్ హాస్పిటల్స్ సభ్యులు, సినిమా రంగ అభిమానులు పాల్గొన్నారు.

కళాకారుడు రాంబాబుకు పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాల కళాకారుడు వేముల రాంబాబుకు తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారం లభించింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన కాళోజి తెలుగు వెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నంది పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, ఏపీ తెలుగు భాషా సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, అధ్యక్షులు పోరాజు రాజ్ కుమార్, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు చేతుల మీదుగా ఈ నంది పురస్కారాన్ని అందుకున్నారు. 1000కి పైగా మాట్లాడే బొమ్మ ప్రదర్శనలు ఇచ్చి, ఇంద్రజాల కళా రంగంలో ప్రత్యేక నైపుణ్యం సాధించిన రాంబాబుకి నంది పురస్కారంతో పాటు జ్ఞాపిక ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. మాట్లాడే బొమ్మతో వివిధ రకాల విన్యాసాలు, వినూత్న కార్యక్రమాలతో ప్రేక్షకు లకు వినోదాన్ని అందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో సాగుతున్న రాంబాబుకి నంది పురస్కారం రావడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల విద్యావేత్తలు, రచయితలు, కవులు, సామాజిక వేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థులు

విశాలాంధ్ర-తెనాలి : అమలాపురంలో ఈ నెల 14, 15 తేదీలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మొదటి ప్రయత్నంలోనే తెనాలి విద్యార్థులు తమ ప్రతిభను చూపారని శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ తెలిపారు. పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు బాక్ స్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి స్టేట్‌మీట్‌కు అర్హత సాధించారని చెప్పారు. అర్హత సాధించిన ఐదుగురిలో నలుగురు విద్యార్థులు ధనాల తనుశ్రీ, షేక్ హనీఫ్, లీల నాగేంద్రబాబు, యద్ల తరుణ్ స్టేట్‌మీట్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్ పొందారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ పరిశా సర్దార్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

UNITY Small Finance Bank

యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: సెంట్రమ్‌హౌస్, విద్యానగరి మార్గ్, కలీనా, శాంటాక్రూజ్ (ఇ), ముంబై-400098

లాంఛనప్రాయ స్వాధీనత ప్రకటన
(స్థిర ఆస్తుల కొరకు) రూల్ 8(1) చూడుము

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/ హామీదారులకు కింద పేర్కొన్న తేదీలో డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. సదరు నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా పిలుపునివ్వడమైనది. రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/హామీదారులకు బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు,2002 యొక్క నిబంధన 8తో చదివే పేర్కొన్న చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారుఈ కింద పేర్కొన్న ఆస్తులను స్వాధీన పర్చుకోవడమైనదని రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా ఈ కింద వివరించిన బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీకి గాను **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీతలు/హామీదారులను మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. హామీగా పెట్టిన ఆస్తులను విడిపించుకోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్-13, ఉప సెక్షన్ 8 యొక్క నిబంధనల్ని గమనించవలసిందిగా రుణగ్రహీత'లు/సహ-రుణగ్రహీత'లు/హామీదారులను కోరడమైనది.

రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు/ రుణఖా సంఖ్య	హామీగాపెట్టిన/ తనఖా పెట్టబడిన ఆస్తి(లు) వివరాలు	డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి మొత్తం
1. రాంబాబు డెయిరీ ఫామ్ 2. వేముల రాంబాబు 3. వేముల ప్రభావతి రుణఖాతా సంఖ్య: USFBVJWLOAN 000005010028 స్వాధీనత తేదీ: 12/09/2024	గుంటూరు జిల్లా, కాకుమాను సబ్ రిజిస్ట్రీ, కాకుమాను మండలం, తెలగాయపాలెం గ్రామ పంచాయతీ, గరికపాడు డి.సం. 931/ఎల్, అసెస్‌మెంట్ సం.87, డోర్ సం.1-87 ఆధారంగా ఉన్న అర్.సి.సి. దాబాతో పాటు 89.0 చదరపు గజాలు లేదా 74.415 చదరపు మీటర్ల కొలత స్థిర ఆస్తి మొత్తంగా. హద్దులు: (తనాఖా దాక్యుమెంట్ ప్రకారం): తూర్పు: వేముల లక్ష్మణ ఆస్తి, పడమర: మిక్కిలి భాస్కరరావు ఆస్తి, ఉత్తరం: పంచాయతీ రోడ్డు, దక్షిణం: మోపర్తి అన్నమ్మ ఆస్తి, కొలతలు: 480 చదరపు అడుగుల్లో ఆర్.సి.సి. దాబాతోపాటు . 89.0 చదరపు గజాలు లేదా 74.415 చదరపు మీటర్ల ఆస్తి.	డిమాండ్ నోటీసు తేదీ: **20.06.2024** 10/06/2024 నాటికి రూ.10,57,592/- (పది లక్షల యాభైఏడు వేల ఐదు వందల తొంభైరెండు రూపాయలు మాత్రమే) + వర్తించబడు వడ్డీ మరియు ఇతర చార్జీలు
1. షేక్ బాజి కిరాణా షాప్ 2. షేక్ బాజి 3. షేక్ మాబు బాషా రుణఖాతా సంఖ్య: USFBVJWLOAN 000005010105 స్వాధీనత తేదీ: 13/09/2024	ఆస్తి 1 : గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల సబ్ జిల్లా ఏరియా, కొలకలూరు గ్రామ పంచాయతీ ఏరియా, కొలకలూరు గ్రామంలో డి.నం.44/1, డోర్ నం.19-5/1 మరియు అసెస్‌మెంట్ 2787 ఆధారంగా గల పూరిగుడిసెతో పాటు 48.4 చదరపు గజాల స్థల విస్తీర్ణపు స్థిర ఆస్తి మొత్తంగా. హద్దులు: (తనఖా దాక్యుమెంట్ ప్రకారం): ఉత్తరం: క్లైయిముదారు ఆక్రమించిన గుంటూరు రోడ్డు స్థలం. దక్షిణం: సయ్యద్ చిన బుజ్జికి చెందిన ఆస్తి; తూర్పు: పంచాయతీ బజార్ రోడ్డు, పడమర: షేక్ ఖాజాబీకి చెందిన ఆస్తి. పై సరిహద్దుల పరిధిలో దాబా ఇంటి యొక్క 48.4 చదరపు గజాలు లేదా 40.46 చదరపు మీటర్ల స్థలం. ఆస్తి 2: గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల సబ్ జిల్లా ఏరియా, కొలకలూరు గ్రామ పంచాయతీ ఏరియా, కొలకలూరు గ్రామంలో డి.సం.45/1, డోర్ నం.19-7 మరియు అసెస్‌మెంట్ 3610 ఆధారంగా గల ఆర్‌సిసి దాబాతో పాటు 72 చదరపు గజాల స్థల విస్తీర్ణపు స్థిర ఆస్తి మొత్తంగా. హద్దులు: (తనఖా దాక్యుమెంట్ ప్రకారం): ఉత్తరం: సయ్యద్ ఆదాం షఫికి చెందిన ఆస్తి 35'0"; దక్షిణం: రావూరి సుమతికి చెందిన ఆస్తి 35'0" తూర్పు: షేక్ మాలిన్‌కు చెందిన ఆస్తి 43'0"; పడమర: పంచాయతీ బజార్ 43'0"; పై సరిహద్దుల పరిధిలో 72 చదరపు గజాలు లేదా 60.19 చదరపుమీటర్ల కొలత స్థలంలో ఆర్‌సిసి భవనం.	డిమాండ్ నోటీసు తేదీ: **21.05.2024** 18/05/2024 నాటికి రూ.31,77,994/- (ముప్పై ఒక్క లక్షల డెబ్బైఏడు వేల తొమ్మిది వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే) + వర్తించబడు వడ్డీ మరియు ఇతర చార్జీలు

తేదీ: 17/09/2024
ప్రదేశం: గుంటూరు (ఆంధ్రప్రదేశ్)

సం/- (అధీకృత అధికారి)
యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

జాతీయ ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర – కారంపూడి : బ్రహ్మనా యుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రెయిన్ పాల్ విద్యార్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ ఖో ఖో బాలుర జట్టుకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత శివ సోమవారం తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన రెయిన్ పాల్ ఈనెల 16వ తేదీ నుండి 26వరకు బాపట్ల జిల్లా జె పంగులూరులో శిక్షణ పొంది అనంతరం సెప్టెంబర్ 28 తేదీ నుండి అక్టోబర్ 2వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖో ఖో పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణరాజు, శ్రీనివాసరావు తెలియజేశారు. రెయిన్ పాల్‌కు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బాలునాయక్, పాఠశాల పూర్వవిద్యార్థి కమిటీ అధ్యక్షులు మోదీన్ సా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

'బ్రదర్' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-మాచర్ల : వినుకొండకు చెందిన ప్రసిద్ధి కవి కరిముల్లా రచించిన బ్రదర్ పుస్తకాన్ని అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు పాషావలి సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రేమను శాంతిని నింపుతూ, మతసామరస్యం హిందూ ముస్లిం సమైక్యత సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా కరిముల్లా కవిత్వం ధ్వజమెత్తిందన్నారు. కరిముల్లా 26 పుస్తకాల వరకు రచించారని, ప్రస్తుతం 15 పుస్తకాలు ప్రచురణ జరిగిందన్నారు. అబాబి అనే పక్షి పేరుతో ప్రారంభించిన ప్రక్రియను దాదాపు 100 మంది దాకా కవులు అనుసరించడం సామాన్యమైన విషయం కాదన్నారు. కరీముల్లా మాట్లాడుతూ అబాబి అనేది ఒక పక్షి అని తెలియజేస్తూ వాటికి ఉన్న కనీస ఐక్యత మనలో లోపించిందనేది ఈ కవితలో ప్రస్ఫుటంగా తెలియజేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా కరీముల్లాను మధార్ సాహెబ్, షేక్ జలీల్, గాదె రామకృష్ణారావు, మన్నెం పాండురంగారావు, ఎస్కే మస్ పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

వరికపూడి శాల ప్రాజెక్టు వెంటనే ప్రారంభించాలి

విశాలాంధ్ర-వినుకొండ: వరికపూడి శాల ప్రాజెక్టును టీడీపీ ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో అఖిలపక్షనాయకులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అటవీ శాఖ పర్యావరణ వన్యప్రాణుల సంరక్షణ శాఖల నుంచి అనుమతులు లభించినా, వెల్దుర్తి మండలంలో మొదటి ఫేసులో సుమారు 24 వేల ఎకరాలు సాగుకై అనుమతులు లభించినా, మొత్తం ప్రాజెక్ట్ అయ్యే 3,500 కోట్లలో 1600 కోట్లు కేటాయించమని అఖిలపక్షాలు వరికేపుడిశాల సాధన కమిటీ డిమాండ్ చేసినప్పటికీ విడుదల చేయలేదు. కనీసం అడవిలో పనులు ప్రారంభానికయ్యే ఇరిగేషన్ డిపార్మెం ట్ వారికి 18 కోట్లు కేటాయించగా రైతుల పొలాలలో ఎన్నికల గెలుపు కొరకై అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పనులు ప్రారంభించడం శోచనీయం. ప్రస్తుతం తెలుగు దేశ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 102 రోజులు గడిచినప్పటికీ గత అసెంబ్లీ సమావేశాలలో బడ్జెట్లో మొదటి విడతగా రూ.1600 కోట్లు కేటాయించాలని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారికి 18 కోట్లు కేటాయించాలని కోరినప్పటికీ ఇప్పటికీ కేటాయింపులు జరగలేదు. ఈనెల 18న మంత్రి మండలి సమావేశాలు జరుగుతున్న కారణంగా వెంటనే నిధులు కేటాయిం చాలని ఏజెండాలో చేర్చాలని డిమాం డ్ చేస్తున్నాం. కృష్ణానది జలాలు పరివాహక ప్రాంతాలు ఇటీవల కురి సిన వర్షాల కారణంగా కళకళలాడుతున్నాయని శ్రీశైలం నుండి 3.92 92 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 4. 44 లక్షల నీరు దిగువకు వస్తుంది సాగర్ జలాశయానికి 2.76 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు సాగర్ నీటిమట్టం 590 అడుగులు కాగా నేటికీ 587.1 అడుగులు మేరకు నీటి సామర్థ్యం ఉంది సముద్రంలోకి నీరు వృధాగా వెళ్తుందని వారన్నారు. వరికపూడి శాల అమలులోకి వచ్చి ఉంటే మాచర్ల గురజాల వినుకొండ ఎర్రగొండపాలెం నియోజకవర్గాలలో ఏడు మండలాల్లో ఉన్న చెరువులు నింపటం ద్వారా 1,20,000 ఎకరాలకు సాగునీరు అంది ఉండేది. కావున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ మాచర్ల ఎమ్మెల్యేలు జీవి ఆంజనే యులు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం మేరకు వెంటనే మంత్రి మండలిలో నిధులు కేటాయించేందుకు ఏజెండాగా పెట్టి చర్చించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంత రెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడుగు విజయ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రూబెన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల మార్పు హర్షణీయం

విశాలాంధ్ర-మాచర్ల : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇక నుంచి ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా మార్చుకై సీఎం చంద్రబాబు ఆదేశాలను మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రత్యేక కుర్చీ, రెడ్ క్లాత్‌తో కూడిన పోడియం కలిగి రాజరిక వ్యవస్థను తలపించే లా ఉన్నాయన్నారు. నిత్యం లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి చలానాలు చెల్లించి రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే కనీస మర్యాదలు కూడా దక్కటం లేదన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరికి సులువు తరంగా అందించేందుకు కొత్త సంస్కరణలను తీసుకురావడం శుభపరిణామమని, అది విజన్ ఉన్న నాయకుడైన సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. నాటి జగన్ పాలనలో కొత్త సంస్కరణలు కాదు గదా… ఉన్న వ్యవస్థలన్నీ నిర్వీర్యానికి పాల్పడ్డాదన్నారు. ఐపీఎస్ అధికారులను సైతం చట్టాన్ని అతిక్రమించేలా హుకుం జారీ చేసి జగన్ అధికార దుర్వినియోగానికి ఒడికట్టాద న్నారు. దానికి తాజా ఉదాహరణ 40 రోజులపాటు చిత్రహింసలకు గురైన ముంబైకు చెందిన సినీ నటి జేత్వాని కేసేనన్నారు.

పేదలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేదలకు మెరుగైన వైద్యం అందించుటకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోడ్ రెపో సీఈవో సులేమాన్ కోరారు. పట్టణంలోని సాంబశివనగర్ ఉన్నత స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముఖ్య అతిథిగా పాల్గొని బాలింతలు, పసిపిల్లలకు పాలిచ్చుటకు ఏర్పాటు చేసిన గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సాయికిరణ్, సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సరైన వసతులు ఉండేవి కావని రాను రాను ప్రభుత్వాలు ఆరోగ్య ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో సదుపాయాలు మెరుగుపరిచారని అన్నారు. డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ బాలింతలు పాలిచ్చు గదిని ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన కోడ్ రెప్ సీఈవో ఎన్ఆర్ఐ సులేమాన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పోతుల వెంకట్, జీవీహెచ్‌సీ ప్రసాద్, సులేమాన్ సోదరుడు ఆర్కిటెక్ట్ జబ్బార్, సాధిక్, బాజీ, షరీఫ్ హాస్పటల్ సిబ్బంది, ఆశ వర్కర్లు, రోగులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు 5వ వర్ధంతి సందర్భంగా పట్టణం లోని వృద్ధాశ్రమాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మొల్లమాంబ వృద్ధాశ్రమం, ఆదరణ వృద్ధాశ్రమాల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ యల్లినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు వివిధ హోదాల్లోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ , పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మీలాదున్ నబి

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు పఠాన్ అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం మీలాదున్ నబి వేడుకలు ఘనంగా జరి గాయి. ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు హాజరయ్యారు. మానవులంతా ఒకటేనని ప్రతి ఒక్కరూ పరస్పరం ప్రేమ భావం, శాంతి భావన కలిగి ఉండాలని ప్రవక్త మహమ్మద్ బోధించారని అన్నారు. స్త్రీలను గౌరవించాలని వారి హక్కుల కోసం అందరూ పాటుపడాలని ప్రవక్త బోధించారని తెలిపారు. పేద ధనిక వ్యత్యాసాలు కుల,మత వ్యత్యాసాలు వీడి మానవులు సోదరుల వలే కలిసిమెలగాలన్న ప్రవక్త బోధ సర్వమానవాళికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పఠాన్ షమీంఖాన్ తెలుగుదేశం పార్టీ నాయకులు సౌదాగర్ జానీ భాష, షేక్ ఖాసిం, దస్తగిరి, చికెన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-అమరావతి : మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అమరావతిలోని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం శుభాకాంక్షలు. తెలుపుకున్నారు. శాంతి, సోదరభావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని బోధించిన మహమ్మద్ ప్రవక్త పుట్టిన అత్యంత పవిత్రమైన రోజుని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

బాధిత కుటుంబానికి తోడ్పాటు

విశాలాంధ్ర-దావేపల్లి: తక్కెళ్ళపాడు గ్రామంలో విద్యుదాఘాతంతో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి సోమవారం తహశీల్దార్ కుటుంబరావు చేయూత నిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. వారిలో స్థానిక నేతలు, అధికారులు ఉన్నారు.

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr.& 1 floor, Sri Narayana Bhavan. Saibaba Street, Dabagardens, D.NO.31-31-21 Visakhapatnam-530020

NOTICE UNDER SEC. 17 OF SECURITIZATION ACT R/W PROVISONS OF THE DEBTS RECOVERY TRIBUNAL ACT AND THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES, 1993 AS AMENED FROM TIME TO TIME

CASE No. APPEAL No. 2 /2020

Between:
Syed Ershad Ahmed and 3 Others ...Plaintiffs
And
Canara bank (syndicate bank) represented by its Branch Manager and another. ....respondents
To:
R-2: Byra Sreenivasa Rao, S/o.Byra Kotiah aged about 51years, D.No.36-16-/1, Purushotama Patnam, Post Chilakaluripet Mandal, SRo Chilakaluripeta Guntur Dt, Andhra Pradesh-522616.

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED SHOULD NOT BE GRANTED

An application under Sec.30 of the RDDB & FI ACT 1993 has been filed before this tribunal show cause to why the relief prayed for should not be granted. You are required to file reply, and counter if any in your defence in the paper book form in two complete sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before this Tribunal on 29-10-2024 at 10.30A.M. failing which the application shall be heard and decided in your absence. You are further directed to supply advance copy of reply to the SA to the Counsel for the applicant.Given under my hand and the seal of this Tribunal on this 10th day of September, 2024.

Assistant Registrar Debts Recovery Tribunal, Visakhapatnam

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr.& 1 floor, Sri Narayana Bhavan. Saibaba Street, Dabagardens, D.NO.31-31-21 Visakhapatnam-530020

NOTICE UNDER SEC. 17 OF SECURITIZATION ACT R/W PROVISONS OF THE DEBTS RECOVERY TRIBUNAL ACT AND THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES, 1993 AS AMENED FROM TIME TO TIME

CASE No. AOR APPEAL No. 3 /2020

Between:
M/s. Sri Sudha Cotton Syndicate represented by its Proprietor Sri Pedavalli Venkat Subbarao S/o. Venkata Rao. ...Appellant
And
Canara Bank (Syndicate Bank) represented by its Branch Manager and Others. ....Respondents
To:
R-2:Byra Sreenivasa Rao, S/o.Byra Kotiah aged about 51years, D.No.36-16-/1, Purushotama Patnam (Po), Chilakaluripet(Md), SRo Chilakaluripeta Guntur District, Andhra Pradesh-522616.

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED SHOULD NOT BE GRANTED

An application under Sec. 30 of the RDDB & FI ACT 1993 has been filed before this tribunal show cause as to why the relief prayed for should not be granted. You are required to file reply, and counter if any in your defence in the paper book form in two complete sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before this Tribunal on 29-10- 2024 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence. You are further directed to supply advance copy of reply to the SA to the Counsel for the applicant. Given under my hand and the seal of this Tribunal on this 10th day of September, 2024.

Assistant Registrar Debts Recovery Tribunal, Visakhapatnam

గ్రామ చెరువు, డి.నెం.203, చమళ్ళమూడి, వట్టిచెరుకూరు(మం), గుంటూరుజిల్లా.

టెండరు ప్రకటన

గుంటూరుజిల్లా, వట్టిచెరుకూరు(మం), చమళ్ళమూడి గ్రామంలో యున్న గ్రామ చెరువు డి.నెం.203కు సంబంధించి ఈ దిగువ తెలిపిన పనికి రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనికి టెండరు షెడ్యూళ్ళను **ది.17-09-2024** నుండి **ది.01-10-2024** సాయంత్రం **గం॥4-00** వరకు సదరు చెరువు కార్యనిర్వహణాధికారి వద్ద పొందవచ్చును. టెండరు ధరఖాస్తుతోపాటు టెండరు ధరావత్తు పైకము డి.డి. ద్వారా కానీ నగదు రూపంలో గాని చెల్లించి రశీదు పొంది ఇందుతో జతపరచవలెను. పూర్తిచేసిన టెండర్లు **ది.03-10-2024** మధ్యాహ్నం **గం॥1-00** వరకు స్వీకరించి అదేరోజు సాయంత్రం **గం॥4-00**లకు సీల్డు టెండర్లను కార్యనిర్వహణాధికారి గారిచే తెరవబడును. పూర్తి వివరాలకొరకు గ్రామ చెరువు కార్యాలయం పనిదినములలో సంప్రదించగలరు.

వ.నెం.	పని పేరు	అంచనా విలువ	టెండరు ధరావత్తు	టెండరు షెడ్యూలు ఖరీదు	పని పూర్తిచేయు కాలము
1)	చెరువులో జంగిల్ క్లియరెన్స్	రూ.5,00,000/-	రూ.5000/-	రూ.500/-	2 నెలలు

ప్రదేశము: చమళ్ళమూడి
తేది: 16.09.2024

ఇట్లు
కార్యనిర్వహణాధికారి

సీఆర్ నగర్‌కు ప్రధాన రహదారి ఏర్పాటు చేయాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు రూరల్ పరిధిలోని చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నగర్‌కు ప్రధాన రహదారిని ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి విజ్ఞప్తి చేశారు. సీఆర్ నగర్ కార్యదర్శుల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఎంపీ గల్లా జయదేవ్ ఎంపీగా ఉన్న సమయంలో సీఆర్ నగర్ ప్రధాన రహదారికి శంకు స్థాపన చేశారని గుర్తుచేశారు. నగరపాలక సంస్థ అధికారు లు రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపిం చారన్నారు. అనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి నిర్మించకుండా ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. దీంతో ప్రధాన రహదారి సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధికి సీఆర్ నగర్ ఆమడదూరంలో ఉందని అన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ప్రధాన రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. సీపీఐ పోరాట ఫలితంగా సీఆర్ నగర్‌లో విద్యుత్, రోడ్లు, కాలువలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోగలిగామని, అలాగే పల్స్ సర్వే నిర్వహించారని, ఓట్లు సాధించుకోగలిగామని, స్వచ్ఛ భారత్‌లో భాగంగా జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా సుమా రు 3 వేల మరుగుదొడ్లు నిర్మించుకోగలిగామని తెలిపారు. కానీ నగరపాలక సంస్థ పాలక వర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని, వెంటనే ప్రధాన రహదారి, సైడ్ రోడ్లు, కాలువల నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రతిపాదు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు బాధ్యత తీసుకొని సీఆర్ నగర్‌కు మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు దేవానాయక్, మౌలాలి, బత్తుల శ్రీను, కాసిం, నక్షత్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-మాచర్ల: దళిత వర్గాల అభివృద్ధికి బాలబాట దోహ దపడుతుందని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ అన్నారు. సోమవారం పట్టణంలోని నెహ్రూ నగర్‌లో ఏర్పాటు చేసిన బాలబాట ఆర్గనైజర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దళితులు అన్ని రంగాలతో పాటు విద్యలోనూ రాణించాలని సంస్థ ద్వారా ఎన్నో బాలబాట కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డీ.బి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ అణుశక్తి కన్నా అక్షర శక్తి గొప్పదని, గురుకుల పాఠశాలలో ఎంట్రన్స్ కు ఇప్పటినుంచే శిక్షణ ఇవ్వాలని ఆర్గనైజర్లను కోరారు. బాలబాట ఆర్‌సిఓ పేరుపోగు ప్రసాద్ మాట్లాడుతూ బాలల హక్కులు సాధన కోసం, బాల్య వివాహాలను నిర్మూలన కోసం పల్నాడు కేంద్రంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పి.సునీల్, పొన్నాల ప్రవీణ్ కుమార్, డి వెంకయ్య, పి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-శావల్యాపురం: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ నందు పల్నాడు జిల్లా బాలో త్సవ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మండలంలోని శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసరాజు, తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్టియూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్ల రాజారమేష్‌లుగా ఎంపికయ్యిన సందర్భంగా వారిరువురిని ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్టియూ ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, ఉపాధ్యాయులు బివి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర-దాచేపల్లి: మండలంలో తక్కెళ్ళపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో ఓ రేకుల ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితురాలు వట్టెపు కుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరగడంతో ప్రాణాపాయం తప్పింది. సామాగ్రి అంతా కాలి బూడిదైంది. కట్టు వస్త్రాలతో మిగిలిపోయాం. నేతలతో పాటు ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలు

విశాలాంధ్ర-దాచేపల్లి: మొహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ముస్లిం సోదరులు సోమవారం మిలాదుల్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగానే తదితర గ్రామాల్లో ముస్లింలు, మసీదుల్లో ప్రత్యేక నమాజు చేశారు. దాచేపల్లి జామియా మసీదు లో కూల్ డ్రింక్ వ్యాపారి మోమిన్ మస్తాన్ వలీ తోటి ముస్లింలకు మిఠాయిలు పంపిణీ చేశారు. మసీదు ఇమామ్ మౌలానా నాయబ్ షేక్ రఫీ, అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా తదితరులు ప్రవక్త పుట్టినరోజు ప్రాధాన్యతను వివరించారు. తక్కెళ్ళపాడులోని సైదావలీ బాబా దర్గాలో భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా నిర్వాహకుడు హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోడెలకు ఘననివాళి

విశాలాంధ్ర-వినుకొండ: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ ఆయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం కోడెల శివప్రసాద్ ఐదో వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు వారికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ కోడెల శివప్రసాద్ రాష్ట్రం గర్వించదగ్గ నాయకుడని వారు అన్ని శాఖల్లో పని చేశారని చివరగా నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా చేసిన ఘనత వారికే దక్కుతుందని అన్నారు. అలాగే భవిష్యత్తులో వారిని ఆదర్శంగా తీసుకొని మన నియోజకవర్గంలో కూడా జీవీ ఆంజనేయులు వినుకొండను అభివృద్ధి పథంలో నడుపుతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవింద నాయక్, రొడ్డ వీరాంజనేయరెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, పత్తి పూర్ణచంద్రరావు, పెసల వెంకటనారాయణ, వజ్రాల కృష్ణారెడ్డి, సోమేపల్లి శ్రీనివాసరావు, సౌదాగర్ జానీ భాష, భత్తుల గోవిందరాజులు, ఆళ్ల మన్నయ్య, గట్టుపల్లి శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి, చికెన్ బాబు, దస్తగిరి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కర్తవ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

విశాలాంధ్ర-విజయపురిసౌత్: మాచర్ల మండలం కమ్మంపాడు లోని జడ్పీ హైస్కూల్ పీఈటి గొట్టిపాటి కర్తవ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో సోమవారం నర్సారావుపేటలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొని ప్రముఖ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు గొట్టిపాటి కర్తవ్యను సన్మానించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు కర్తవ్యను అభినందించారు.

రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో 100 వీల్ చైర్స్, వికలాంగులకు 115 మందికి కృత్రిమ జైపూర్ కాళ్ళు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కె.శరత్ చౌదరి హాజరయ్యారు. అనంతరం గవర్నర్ శరత్ చౌదరి చేతుల మీదుగా వృద్ధులకు వీల్ చైర్స్, వికలాంగులకు కృత్రిమ జైపూర్ కాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గుండా అశోక్ కుమార్, సెక్రెటరీ నీరుమళ్ళ రాజేష్, ట్రెజరర్ గుర్రం కృష్ణ కాంత్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నింటికన్నా విద్యాదానం గొప్పది: డాక్టర్ ఆలా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్యార్థినీ, విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని ప్రముఖ సీనియర్ వైద్యులు ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. కష్టాన్ని గుర్తించే నేత్రం-కన్నీటిని తుడిచే హస్తం అంటూ ఏడాది క్రితం ప్రారంభమైన నేస్తం స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జ్ఞాననిధి విభాగాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. గుంటూరులోని రామకృష్ణ సహకార జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకకు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'అందరికీ విద్య-అందరిదీ బాధ్యత' అనే అంశాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేస్తం స్వచ్ఛంద సేవ సంస్థ జ్ఞాన నిధిని ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని కొనియాడారు. నేస్తం చేపట్టిన ఈ మహత్కార్యానికి తమ వంతు కృషిగా రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని జ్ఞాన నిధికి అందజేస్తానన్నారు. విశిష్ట అతిథి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురు నిరక్షరాస్యు లలో ఒకరు భారతదేశం నుంచి ఉండ టం దురదృష్టకరమన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులను నేస్తం సంస్థ ఆదుకొని ప్రోత్సహించడం అభినందనీ యమన్నారు. నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్ మాట్లాడుతూ దాతల ఆర్థిక సాయంతో, సభ్యుల సమన్వయ సహకారాలతో తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందాన్ని కలిగిస్తుంద న్నారు. విద్యార్థుల అవసరార్థం నేస్తం సభ్యులు ఓ కంప్యూటర్‌ను రామకృష్ణ సహకార జూనియర్ కళాశాలకు అందజేశారు. నేస్తం సహ వ్యవస్థాప కులు టి.ధనుంజయ రెడ్డి, రామకృష్ణ సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కన్నా రెడ్డి, నేస్తం సభ్యులు జి.రాజేంద్ర కుమార్, కె.సత్యనా రాయణ, త్రిపుర సుందరరావు, గోపాల్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు ఏచూరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజాశ్రేయస్సు కోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు సీతారాం ఏచూరి సీపీఐ (ఎం)అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. దేశం గొప్ప పోరాట యోధుడ్ని కోల్పోయిందని అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించటానికి విరామ మెరుగక కృషి చేసిన నిత్య శ్రామికుడు సీతారాం ఏచూరి అని ప్రశంసించారు. నివాళు లర్పించిన వారిలో ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, తెలుగు పండితులు రాజన్న మాస్టారు, న్యాయవాది సుభాని తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర-ప్రతిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సంఘాల సభ్యులు, జాతీయ ఉపాధి హామీ పథకం అధికారులు మంగళవారం హాజరు కావాలని ఎంపిడిఓ రామకోటయ్య కోరారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమాలను మండలంలోని అన్ని పంచాయతీల్లో ఘనంగా వేడుకలు నిర్వహించాలని తెలిపారు.

నిష్కళంక ప్రజాసేవకుడు కొల్లా వెంకయ్య

నేడు వర్ధంతి సందర్భంగా..

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఒకరి జీవితం మరొకరికి స్ఫూర్తినిస్తుంది. ఎన్నడో మనల్ని వదలి వెళ్లిన ఒక వ్యక్తిని స్మరించు కోవటమంటే ఆయన స్ఫూర్తితో ప్రజలకు దగ్గరకావటమే. ప్రజానాయకుడు, విప్లవ యోధుడు, మాజీ ఎంపీ కొల్లా వెంకయ్యను ఇలా స్మరించుకోవటమంటే నాటి పోరాటాల ఉద్వేగ కాలంలోకి తొంగి చూడటమే. అవును ఆయన జీవితమే పోరాటాల చరిత్ర. చివరి వరకు ప్రజలకోసం, వారి అభ్యున్నతికోసం గడిపిన మహోన్నత శక్తి అతను. ప్రజలను దుర్భర దారిద్ర్యంలోకి ఈడుస్తున్న భూస్వామ్య దోపిడీ లేని రాజ్యాన్ని, దేశ ఆర్థిక జీవనాడులను పీల్చి పిప్పిచేస్తున్న సామ్రాజ్యవాద దోపిడీ లేని సమసమాజాన్ని ఆవిష్కరించాలని కొల్లా వెంకయ్య ఆకాంక్షించారు. నేడు ఆయన 26వ వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన జన్మించిన గ్రామం పెదనందిపాడులో మంగళవారం పలు కార్యక్రమాలను ఆయన కుమారుడు, నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, కుటుంబ సభ్యులు, అభిమానులు ఏర్పాటు చేస్తున్నారు. ఆయన పేరుతో కొత్త గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించను న్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య, హైదరా బాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది కొల్లా రాహుల్ సాంకృత్యాన్, హైదరబాద్ బుక్ ట్రస్ట్‌కు చెందిన గీతా రామరామి తదితరులు పాల్గొనున్నారు. 1910లో ఉమ్మడి గుంటూరు జిల్లా, పెదనందిపాడులో జన్మించారు. 1921లో బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఆంధ్ర శివాజీ పర్వతనేని వీరయ్య నాయకత్వంలో జరిగిన పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం ప్రభావం కొల్లా వెంకయ్యపైన పడింది. భూ సంస్కరణల అమలు కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొల్లా వెంకయ్య 1998 సెప్టెంబరు 17న తుదిశ్వాస విడిచారు. విప్లవనేత కొల్లా వెంకయ్యకు ఇప్పటికీ ఎందరో నివాళులర్పిస్తారు.

విశాలాంధ్ర

శివాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్

విశాలాంధ్ర- పెద కాకాని : మండల కేంద్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ, మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామ వరప్రసాద రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం ఆచరణీయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అల్లాకు ఇష్టమైన చివరి ప్రవక్త ముహమ్మద్ జన్మదినం సందర్భంగా శాంతి ర్యాలీలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మధవి తెలిపారు. సోమవారం మొహిద్దీన్ పాలెంలోని దర్గా వద్ద నుండి ప్రారంభమయిన శాంతి ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కాలనీ నందు గల కడప దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళిని శాంతి మార్గంలో నడిపించటానికి ఎనలేని కృషి చేసి, మానవుడు జీవితం ఎలా గడపాలో నేర్పిన మహోన్నతుడు ముహమ్మద్ ప్రవక్త అన్నారు. మహిళలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి వారి అభ్యున్నతికి ఆయన నిల్చాడని, తల్లి పాదాల కింద స్వర్గం ఉన్నదని ప్రజలకు ఉపదేశించి వారిని సన్మార్గంలో నడిపారని తెలిపారు.

నిబద్ధత కల నేత కోడెల : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: టీడీపీకి బలమైన నిబద్ధత కలిగిన నేత కోడెల శివప్రసాద రావు అని ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ శివప్రసాదరావు మంచి మనసున్న డాక్టర్ అని ఎంతో మంది పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్య సేవలు అందించారన్నారు. వైసిపి ప్రభుత్వ వేధింపులకు కోడెల బలయ్యారన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు దాసరి రాజా మాస్టారు, కంచర్ల శివరామయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు పతకాలు

విశాలాంధ్ర -తెనాలి : స్థానిక చెంచుపేట లోని యూనిక్ తైక్వాండో క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీలలో కడప జిల్లా శంఖరాపురం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో ఆరుగురు క్రీడాకారులు పాల్గొన్నారని యూనిక్ తైక్వాండో అకాడమీ చీఫ్ కోచ్ బట్టు నాగరాజు తెలియజేశారు. నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొని వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభకనబరచారని ఐదు స్వర్ణ, ఒకటి రజత పతకాలు సాధించారన్నారు. ఈ క్రీడాకారులను తెనాలి యూనిక్ తైక్వాండో అకాడమీ గౌరవాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ టెక్నికల్ డైరెక్టర్ గోపినాయుడు, అకాడమీ అధ్యక్షురాలు పి.గీత, కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

రోడ్లు, డ్రైన్లలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల వెంబడి ఉన్న కొబ్బరి బొండాలు, టిఫిన్, టీ విక్రయదారులు వ్యర్థాలను రోడ్ల మీద, డ్రైన్లలో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టంచేశారు. స్థానిక ఏటి అగ్రహారం, శాంతినగర్, జీటీ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం కమిషనర్ పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వివిధ వ్యాపారాలు చేసే వారు వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేస్తున్నారని, ప్రధానంగా కొబ్బరి బోండాలు డ్రైన్లలో వేయడం వలన మురుగుపారుదలకు అడ్డంకిగా ఉంటుందన్నారు. డ్రైన్లలో మురుగు పారుదల లేకుంటే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ తారని, వర్షాలకు వచ్చే నీరు కూడా ఇళ్లల్లోకి వస్తుందన్నారు. శాంతి నగర్, సంపత్ నగర్లో స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉండే వార్డ్ సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్దేశిత సమయాల్లో విధుల్లో ఉండాలని ఆదేశించారు. డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ లక్ష్మణ స్వామి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఓ 84 రద్దు చేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేస్తూ విడుదల చేసిన జీఓ 84ను రద్దు చేయాలని ఎస్టీయూ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు అన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జీఓ వల్ల మున్సిపల్ ఉపాధ్యాయులకు మున్సిపల్ స్కూల్స్‌కి ఎటువంటి ఉపయోగం లేకపోగా తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. గత నాలుగేళ్లుగా బదిలీలు పదోన్నతులు జరగలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి వెంటనే బదిలీలు పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ డిమాండ్ చేస్తోందన్నారు. మొన్న జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో మున్సిపల్ హైస్కూల్ పోస్టులు భర్తీ చేశారని అన్నారు. వారిని వెనక్కి పంపి మున్సిపల్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. నేడు జరిగే స్కూల్ కాంప్లెక్స్‌లు విలీనంలో మున్సిపల్ పరిధిలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లను స్కూల్ కాంప్లెక్స్‌లుగా తప్పించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు అప్పగించడాన్ని ఎస్టీయూ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు వెంటనే స్పందించి స్కూల్ కాంప్లెక్స్ లిస్ట్‌లో మున్సిపల్ హైస్కూల్‌ను కాంప్లెక్స్‌లుగా యధావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల పట్ల వివక్షను విడనాడి ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ఏర్పాటు చేయాలని, బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని అన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్లాన జయప్రకాష్, షేక్ జమీర్ బాషా, షేక్ ఫరిశా, ఎన్.కాలేషా, ఇనకొల్లు అంకమ్మరావు, ఎం.చిన వెంకటస్వామి, కుంభా ఏడుకొండలు, పి.సాగర్ బాబు, కె.సోమ్లానాయక్, అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై దేశవ్యాప్త ఆందోళన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా ముస్లిం సామాజికవర్గం తీవ్ర ఆందోళన చెందుతుందని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ వాటి బాధ్యత ఇప్పుడున్న చట్టాలు అనుకూలంగానే ఉండాలని గుంటూరు జిల్లా మైనార్టీ కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో గుంటూరు జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ గని ఆధ్వర్యంలో మైనార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. త్వరలో జరగబోయే కృష్ణ గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మైనార్టీలకు అవకాశం కల్పించాలని అన్నారు. కృష్ణ గుంటూరు జిల్లాల్లో మైనార్టీల పట్టభద్రుల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని... మైనార్టీలకు అవకాశం కల్పించాలని తీర్మానించారు. గుంటూరు మిర్చియార్డు చైర్మన్ తెలుగుదేశం పార్టీ ఈసారి మైనార్టీలకు కేటాయించాలని, ఇంతవరకు మైనార్టీలకు చైర్మన్ అవకాశం కల్పించలేదని... ఈసారి మైనార్టీలకు అవకాశం కల్పించాలని మైనార్టీ కార్యవర్గ సభ్యులందరూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ రుస్తుంబాబు, మీరా సాహెబ్, షేక్ రఫీ, షేక్ బాజీ, షేక్ జిలాని, మహమ్మద్ రఫీ, మహమ్మద్ బాషా, ఫిరోజ్, షేక్ జాన్ సైదా, ఎస్.ఎం ఇల్లాహి, పర్వేజ్, ఖాదర్ బాషా, షేక్ ఇర్ఫాన్, షేక్ మహబూబ్ జానీ, షేక్ సర్దార్, షేక్ జాన్ సైదా, షేక్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జెర్రి వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర-మాచర్ల : రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ సరిగా లేక లిఫ్ట్ ఇరిగేషన్ అటకెక్కిందన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలో ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశాడన్నారు. జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి నిర్వహణ వ్యయాన్ని అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సాగు, తాగు నీరందిస్తామన్నారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ ప్లాంట్ భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సాధించడంతో పాటు, నియోజకవర్గంలో అవసరమైనచోట్ల పంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకుంటామని తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం ప్రజలకు వెలుగునిచ్చింది: ప్రొఫెసర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మహమ్మద్ ప్రవక్త జీవితం ప్రజలకు వెలుగునిచ్చిందని నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రాజు తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా స్థానిక నందివెలుగు రోడ్డులో ఉన్న గిరిజన తెగలకు చెందిన పిల్లలకు విద్య-ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ హాస్పిటల్స్ డాక్టర్ ఆకేఫ్, ఏఎన్యూ ప్రొఫెసర్ సిద్దిక్ సహకారాలతో పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, క్యాలెండర్లు అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా భావి భారత పౌరులందరికీ మంచి భవిష్యత్తు ప్రసాదించాలని భగవంతుడ్ని కోరుకుంటున్నట్టు తెలిపారు. కష్టపడి చదువుకోవడం వలన తమ జీవితాల్లో తెలుగులు కుమ్మరిస్తాయని ఆయన చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు స్వోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డి.కొండలరావు నిరంతరం చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. డాక్టర్ కొండలరావు మాట్లాడుతూ జీవితంలో ఏది సాధించాలన్న తొలుత ఆరోగ్యం.. ఆ తర్వాత విద్య చాలా ప్రాముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సల్మా, డాక్టర్ జాన్‌వెస్లీ, చంటి, నెహేమియా తదితరులు పాల్గొన్నారు.

బీసీల కులగణన జరపాలి : పరంజ్యోతి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జాతీయస్థాయి జనగణనతో పాటే సమగ్ర కుల గణనను జరపాలని, బీహార్‌లో కులగణన చేసి రిజర్వేషన్లు కల్పించిన విధంగానే రాష్ట్రంలో కూడా బీసీ కుల గణన చేపట్టి బీసీల జనాభా మేరకు రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు బక్కా పరంజ్యోతి డిమాండ్ చేశారు. బీసీ జనగణన అంశంపై బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ సామాజిక అసమానతలు తొలగిపోవాలంటే బీసీ కులగణనే పరిష్కార మార్గమని అన్నారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 9వ తేదీన విజయవాడలో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కులగణన ఉద్యమంలో బీసీలందరిని భాగస్వాములను చేయాలని, వారిలో చైతన్యం నింపుతున్నామన్నారు. బీసీ సంఘాల మద్దతుతో పాటు, అన్ని వర్గాల ప్రజల మద్దతుతో కులగణన ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. బీహార్ సీఎం నితీష్‌కుమార్, ఏపీ సీఎం చంద్రబాబుల మద్దతులో కేంద్రంలోని ఎన్డీఏ కూటమి అధికారంలో ఉందని, కులగణన చేపట్టేవిధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. ప్రముఖ లాయర్, బీసీ నాయకులు వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రతి పౌరుడు చెప్పిన కులం పేరును జన గణనతో పాటే ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. బీసీ జగగణనను వేగవంతం చేసి అర్హులకు మాత్రమే రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు, గుంటూరు జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు, పీవీ రమణయ్య, బీఎస్పీ నాయకులు తెనాలి ప్రకాష్, దొక్కా జగన్మోహనరావు, ఎస్.బాబూరావు, డాక్టర్ మురళీధర్, సీనియర్ జర్నలిస్ట్ చలపతి రావు, బీసీ నాయకులు తాడికొండ నరసింహారావు, మాల్యాద్రి, కోటేశ్వరరావు, విజయలక్ష్మి, చీరతానగండ్ల వాసు, తదితరులు పాల్గొన్నారు.